క్లుప్తంగా

ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓకు సన్మానం



దామరగిద్ద: ఉపాధి పథకంలో ఏపీఓగా విధులు నిర్వహించి బదిలీపై మద్దూర్ మండలానికి వెళ్లిన ఏపీఓ రవికుమార్‌ను ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానించారు. ఈ మేరకు.. ఎంపీపీ నర్సప్ప, ఎంపీడీఓ శ్రీధర్ మాట్లాడుతూ ఈజీఎస్ పథకంలో రైతులు రైతు కూలీలకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ఉదయ్‌శంకర్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్థిక సాయం



ధన్వాడ: మండల కేంద్రంలోని సంతబజార్ ఎంపీపీఎస్ పాఠశాలకు బుధవారం నిడుగుర్తి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రామకృష్ణ పాఠశాలకు రూ.25వేల చెక్కును హెచ్ఎం బాలరాజుకు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కృష్ణా: మండలంలోని నల్లగట్టు సమీపంలో రాయచూర్, మహదేవ్‌కు చెందిన ఇటుకల బట్టీలతో తమ పంటపొలాలు దెబ్బతింటున్నాయని బాధితులు బుడ్డమోళ్ల సురేష్, రాము, మాజీ సర్పంచ్ అంబ్రేష్, బాలు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు.. తమ పంటపొలాల్లో ఇటుక బట్టీల బూడిద వల్ల సాగుచేసిన కంది, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఈ విషయంపై తక్షణమే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ఎంపీడీఓగా సాయిలక్ష్మీ



కోస్గి: నూతన ఎంపీడీఓగా సాయిలక్ష్మీ బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ కాళప్ప మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ కాగా మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న సాయిలక్ష్మీ కోస్గికి బదిలీపై వచ్చారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకొని బదిలీపై వచ్చిన 22మంది పంచాయతీ కార్యదర్శులను విధుల్లో చేర్చుకున్నారు. ఎంపీడీఓ సాయిలక్ష్మీని కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

ఎంపీడీఓగా గోవింద్‌రావు



మక్తల్: నూతన ఎంపీడీఓగా గోవింద్‌రావు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ వనపర్తికి బదిలీపై వెళ్లారు. రాజోలి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న గోవింద్‌రావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల ప్రజల సహకారంతో తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

ఎంపీడీఓగా జానయ్య

కృష్ణా: ఎంపీడీఓగా జానయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా ఉన్న యశోదమ్మ బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో నల్లగొండ జిల్లా సూర్యాపేటకు చెందిన ఎంపీడీఓ జానయ్య ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని, మండల ప్రజలు సహకారం అందించాలని కోరారు.

ధన్వాడ: మండల ఎంపీడీఓగా సాయిప్రకాష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ధన్వాడలో విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి సిద్దిపేట జిల్లాకు బదిలీపై వెళ్లారు. గద్వాల జిల్లాలో అయిజ మండల ఎంపీడీఓగా పనిచేస్తున్న సాయిప్రకాష్ ఇక్కడికి వచ్చారు. ఆయనను పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సన్మానం చేశారు.

విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శులు

కోస్గి: వివిధ ప్రాంతాల నుంచి బదిలీపై కోస్గికి వచ్చిన పంచాయతీ కార్యదర్శులు బుధవారం స్థానిక ఎంపీడీఓ సాయిలక్ష్మీ, ఎంపీఓ వేణుగోపాల్ రెడ్డి, ఎంపీపీ మధుకర్ రావులను కలిసి విధులో చేరారు. 22మంది పంచాయతీ కార్యదర్శులు కోస్గి మండలానికి బదిలీపై రాగా బుధవారం 21మంది కార్యదర్శులు విధుల్లో చేరినట్లు ఎంపీడీఓ తెలిపారు. నూతనంగా విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శులకు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. వైస్ ఎంపీపీ సాయిలుతోపాటు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని సంత్‌మత్ మూల మహా సంస్థానం శక్తిపీఠంలో బుధవారం వసంత పంచమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్కూర్ విభావసు పురోహిత్, కృష్ణ యజుర్వేద పండితుల ఆధ్వర్యంలో కళశపూజా, సరస్వతి ఆవాహనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శక్తిపీఠం వ్యవస్థాపకుడు శాంతానంద్ పురోహిత్ ఆధ్వర్యంలో చిన్నారులతో సామూహిక అక్షరభ్యాసం చేయించారు. అదేవిధంగా పట్టణంలోని సింగర్‌బేస్, అశోక్‌నగర్ సరస్వతి శిశుమందిర్, శాతవాహన కాలనీలోని బ్రిలియంట్ స్కూల్, మండలంలోని కోటకొండ శిశుమందిర్, కొల్లంపల్లి కేశవ శిశుమందిర్ పాఠశాలల్లో సరస్వతిమాత చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం చిన్నారులతో సామూహిక అక్షరభ్యాస నిర్వహించారు. అలాగే స్థానిక మినీస్టేడియం గ్రౌండ్‌లోని బాలకేంద్రం ఆవరణలో ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా మున్సిపల్ వైస్ చైర్మన్, లయన్ డిస్టిక్ గవర్నర్ హరినారాయణ్‌బట్టడ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ గందె కార్తిక్ ముఖ్యఅతిథులుగా హాజరై సంగీత వాయిద్యాలకు పూజలుచేసి కవి జ్ఞానేశ్వర్‌గౌడ్‌కు శాలువాతో సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో రతంగపాండురెడ్డి, ఎల్లప్ప, లక్ష్మయ్య, బాలరాజు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సంగ నర్సింహులు, వసంత్, జ్ఞానామృత, ప్రియాంక, అమల, నిర్వాహకులు మురళీధర్, నారాయణరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.



నారాయణపేటలో సింగర్‌బేస్ శిశుమందిర్‌లో తల్లిదండ్రుల పాదపూజ

ఊట్కూరు: మండలంలోని సరస్వతి శిశుమందిర్‌లో బుధవారం వసంతపంచమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రీ, సరస్వతి యజ్ఞం, పూర్ణాహుతి, అష్టోత్తర నామావళి, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం 40మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. అక్షరాభ్యాసం చేయించడంతో చిన్నారులో జ్ఞాపకశక్తి, మేధాశక్తి పెరుగుతుందని హెచ్ఎం భీంరాజు తెలిపారు. కార్యక్రమంలో వెంకటనారాయణ, రామాంజనేయులు, అనిల్, లక్ష్మీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: వసంత పంచమి వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేరకు పలు దేవాలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మండలంలోని ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల్లో బుధవారం వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్‌రెడ్డి, రాధిక తదితరులు పాల్గొన్నారు.



కోటకొండలో..



మాగనూర్‌లో..



మరికల్‌లో ..



ఊట్కూరులో..

వైభవంగా ఎల్లమ్మ బండారు ఉత్సవాలు



మరికల్‌లో పసుపు బండారును ఒకరిపై ఒకరు వేస్తున్న బంధువులు



మరికల్‌లో భక్తులతో కిక్కిరిసిన ఎల్లమ్మ ఆలయ ఆవరణ

మరికల్: భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బండారోత్సవాలు బుధవారం మండల కేంద్రంలోని వైభవంగా నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలో ఉన్న ఆలయ ఆవరణలో కుర్వ కులస్తులు ముందుగా ఎల్లమ్మ పటం వేసి పూజలు చేశారు. అనంతరం బంధువులు తెచ్చిన నూతన దుస్తులను ధరించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని లక్కర్‌దొడ్డి, యాంకి గ్రామాల్లో బుధవారం ఎల్లమ్మ దేవర బండారు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కర్‌దొడ్డిలోని ఎల్లమ్మ దేవర ఆలయంలో బండారు ఉత్సవాల్లో ఆయా గ్రామాల నుంచి గొల్లకురుమ కుటుంబాలు పెద్ద ఎత్తున పాల్గొని పసుపు బండారును ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. అనంతరం అమ్మవారికి బండారు సమర్పించి, తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి మేకలను, గొర్రెలను బలి ఇచ్చారు.

రైతులపై నిర్లక్ష్యం వీడాలి



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: రైతులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, ఏఐపీకేఎస్, ఏఐపీకేఎంఎస్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని కొటకొండలో బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, చలో ఢిల్లీ కార్యక్రమానికి వెళ్తున్న రైతులపై అనుచితంగా వ్యవహరించడం సరికాదని, నిర్బంధ ఆంక్షలు విధించడం, 144 సెక్షన్ అమలు చేయడం, రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. కార్యక్రమంలో నర్సింహ, జయలక్ష్మీ, యాదగిరి, రాములు, హన్మంతు, వెంకటయ్య, రాంచందర్, శ్రీను పాల్గొన్నారు.

వేసవి కాలంలో మొక్కలు కాపాడాలి

కోస్గి (మద్దూరు): వేసవికాలం దృష్ట్యా నర్సరీలో మొక్కలను కాపాడుకోవాలని నిర్వాహకులకు ఎంపీడీఓ జయరాములు సూచించారు. ఎంపీడీఓగా బుధవారం బాధ్యతలు చేపట్టిన జయరాములు కొత్తపల్లి, మాన్నపూర్ గ్రామాల్లోని నర్సరీలను, అక్కడ జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నర్సరీ నిర్వహణ చేపట్టాలని సూచించారు. మొక్కలపై నీడ ఏర్పాటు, మొక్కలకు నీటిని సకాలంలో అందించాలన్నారు. కూలీల సంఖ్యను పెంచాలని, అడిగిన వారికి పని కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. అలాగే మండలంలోని 47పంచాయతీలకు బదిలీపై వచ్చిన కార్యదర్శులు విధుల్లోకి చేరారని పేర్కొన్నారు. ఉపాధి ఏపీఓ సిద్దేశ్వర్, ఆయా గ్రామాల కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

ఉపాధి కూలీలకు రూ. 600 చెల్లించాలి



దామరగిద్ద: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రోజు కూలీ రూ. 600 చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని ఉడ్మల్‌గిద్దలో ఉపాధికూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రెండు లక్షల 50వేల కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. ఏడాదికి 200రోజులు పనిదినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రథమ చికిత్సపెట్టెను అందుబాటులో ఉంచాలన్నారు. పెండింగ్‌లో కూలీల డబ్బులను అందించాలన్నారు. కార్యక్రమంలో కూలీలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపంపై అవగాహన

నారాయణపేట రూరల్ : పట్టణంలోని 16, 17వ వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషకాహారలోపంపై అవగాహన నిర్వహించారు. డాక్టర్ బాలాజి ముఖ్య అతిథిగా హాజరై ఆయా కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్య వివరాలను పరిశీలించారు. పోషకాహారలోపం వల్ల కలిగే కారణాలు, తీసుకోవాల్సిన చర్యలపై తల్లిదండ్రులు, అంగన్‌వాడీ నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలపై శ్రద్ధ చూయించాలన్నారు. విటామిన్ ఏ ద్రావణం పిల్లలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ శ్రీలత, సూపర్‌వైజర్ సరోజ, వైద్యశాఖ సిబ్బంది తబితరాణి, టీచర్లు లక్ష్మి, సురేఖ, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బాలాజి

గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం

మక్తల్: సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా జిల్లా టాగ్ఆఫ్ వార్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతితోపాటు మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం, జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్, ప్రధాన కార్యదర్శి గోపాల్, అంబ్రేష్, రమేష్, జాంగీర్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

దామరగిద్ద: మండలంలోని లింగారెడ్డిపల్లిలో బుధవారం నాభిశిలాస్థాపన, హనుమాన్ ఆలయ ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలో మహిళలు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేపట్టారు. మహాయజ్ఞం తదితర పూజలు వేదమంత్రాలతో ప్రతిష్ఠాపన ఉత్సవాలను పండగ వాతవరణంలో నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన లింగారెడ్డిపల్లి గ్రామస్తులు పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సత్యయాదవ్, నర్సిరెడ్డి, మాదవరెడ్డి, మొగులప్ప, విండోఅధ్యక్షుడు ఈదప్ప, ఖాజా, మహిపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

విటమిన్ ఏ ద్రావణం పంపిణీ



ఊట్కూరు: మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఏ విటమిన్ ద్రావణాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం కవిత మాట్లాడుతూ.. ఏ విటమిన్ ద్రావణంతో చిన్నారులకు దృష్టిలోపం నివారించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది విజయ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, షహనాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు సన్మానం

కోస్గి: బదిలీపై వచ్చిన సీఐ సోమ నర్సయ్య, ఎస్సై శేఖర్‌గౌడ్‌లను బుధవారం ఎంపీపీ మధుకర్‌రావు, వైస్ ఎంపీపీ సాయిలు సన్మానించారు. ఈ మేరకు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పోలీసు అధికారులను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో పోలీసులకు ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలు అవసరముంటాయని, ప్రజాప్రతినిధులు, నాయకులు పోలీసులకు సహకరించాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో బిజ్జారం బాల్‌రాజ్‌తోపాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులను సన్మానిస్తున్న ఎంపీపీ, తదితరులు

సమ్మెను జయప్రదం చేయండి



మరికల్‌లో వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు



ధన్వాడలో.

మరికల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనంగా ఈ నెల 16న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని బుధవారం కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు గడుస్తున్న కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. అనంతరంసమ్మెకు సబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. బాలప్ప, రాము, ఆంజనేయులు, ఎల్లప్ప, రఘు, తిమ్మన్న పాల్గొన్నారు.

మాగనూర్: దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ పి. ఆంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పంచాయతీల వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలను అవలంభిస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రతిఘటనకు పూనుకోవాలని పిలుపునిచ్చారు.

ధన్వాడ: పంచాయతీ కార్యదర్శులకు కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు.. దేశ వ్యాప్తంగా ఈ నెల 16న సమ్మె గ్రామీణ బంద్‌లో పాల్గొంటున్నామని పంచాయతీ కార్మికులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులుకు సమ్మెనోటీస్ అందజేశారు. భానుప్రకాష్, లక్ష్మయ్య, లక్ష్మణ్, బాలయ్య, బాలమ్మ, తిర్మలమ్మ, పల్లవి పాల్గొన్నారు.

భూ నిర్వాసితులను ఆదుకోవాలి: ఎమ్మెల్యే

మక్తల్: నియోజకవర్గంలోని సంగంబండ, భూత్పూర్, జూరాల ప్రాజెక్టుల కింద ముంపునకు గురైన భూనిర్వాసితులను ఆదుకోవాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అసెంబ్లీలో పేర్కొన్నారు. రూ.32 కోట్ల సంగంబండ రిజర్వాయర్ వద్ద ఉన్న బండ సమస్యను పరిపరిష్కరించనున్నట్లు తెలిపారు. 69జీఓ నంబర్ నారాయణపేట, మక్తల్ నియోజకవర్గానికి రూ. 2945 కోట్లు మంజూరైందన్నారు. ఆత్మకూర్, మక్తల్ మండాలలను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు.

22 మీసేవ కేంద్రాలు.. 335 దరఖాస్తులు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని వివిధ గ్రామాలు, మున్సిపాలిటీలలో కొత్తగా ఏర్పాటు చేయబోయే మీ సేవా కేంద్రాల నిర్వహణకు ఈ నెల 25న కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. జిల్లాలో కొత్త మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదలైందని, జిల్లాలోని 22 మీ సేవ కేంద్రాల నిర్వహణకు 335మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మీ సేవా కేంద్రాల దరఖాస్తు స్వీకరణ గడువు బుధవారంతో ముగిసిందని, దరఖాస్తు చేసిన అభ్యర్థులకు నెల 25న ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

బీజేపీ పటిష్టతకు కృషి చేద్దాం

ఊట్కూరు: బీజేపీ పార్టీ ప్రతిష్టతకు కృషిచేద్దామని రాష్ట్ర నాయకులు నాగూరావు నామాజీ అన్నారు. బుధవారం మండలంలోని అవుసలోనిపల్లిలో బీజేపీ కార్యాలయ భవనానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను గడప గడపకు తీసుకెళ్లి పార్టీని పటిష్టపరుద్దామని అన్నారు. గ్రామంలో పార్టీ కార్యాలయానికి భూమిపూజ చేయడం సంతోషకరమన్నారు. కార్యకర్తలకు అండగా పార్టీ ఎల్లప్పుడు ఉంటుందని ఆయన తెలిపారు. 69జీఓ అమలుకోసం జలసాధన కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్రలో తాను పాల్గొన్నట్లు తెలిపారు. జీఓ అమలుతో నారాయణపేట డివిజన్ ప్రాంతం సస్యశామలమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, మాజీ సర్పంచ్ హన్మంతు, నాయకులు కుర్మయ్య, బాలకృష్ణయ్య, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న నాగురావు నామాజీ

దేశభక్తిని పెంపొందించుకోవాలి

నారాయణపేట రూరల్ : పాశ్చాత్య విశసంస్కృతిని విడనాడి దేశభక్తిని పెంపొందించుకునే విధంగా యువత ముందుకు నడవాలని ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహ ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బుధవారం బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనలో ఆయన ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. వాలంటైన్ డే పేరుతో యువత చెడు మార్గాల వైపు వెళ్లొద్దని, 40మంది వీర సైనికులు దేశం కోసం త్యాగం చేసిన విషయాన్ని గుర్తు తెచ్చుకుని వారికి నివాళులర్పించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, చరణ్, నరేష్, అశోక్, రితీష్, అరవింద్, గౌరీశంకర్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్

జాతీయ విద్యా విధానం రద్దుకు పోరాటం

నారాయణపేట రూరల్: నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కుల, మత భేదాలను సృష్టించి మనుషులను విడదీస్తూ, దేశ సంపదను బడా పెట్టుబడి దారులకు కట్టబెడుతుందని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను విక్రయించి కార్పొరేట్ బూతాన్ని పెంచి పోషిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ఈ నెల 16న నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెకు పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సాయికుమార్, నరహరి, గౌస్, వెంకటేష్, పవన్, కవిత, మహిపాల్, రాజు పాల్గొన్నారు.